క్లుప్తంగా

గంపవానిపాలెంలో సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో కోలాటం ప్రదర్శన

రావికమతం: గంపవానిపాలెంలో శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇక్కడ గౌరీపరమేశ్వరుల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి ఒక్కో రకం మిఠాయితో సారె సమర్పించారు. సర్పంచ్ రొంగలి రామకృష్ణ ఆధ్వర్యంలో యువకులు ఈ ఉత్సవానికి సారథ్యం వహించారు.

అనారోగ్య బాధితుడికి స్నేహితుల బాసట



మంచాన పడిన గౌరినాయుడుకు నగదు అందిస్తున్న స్నేహితులు

కె.కోటపాడు: భవన నిర్మాణ పని సమయంలో మూడేళ్ల క్రితం గాయపడి మంచానికే పరిమితమైన ఎస్.గౌరినాయుడుకు తోటి స్నేహితులు బాసటగా నిలిచారు. గొండుపాలెంలో అతడికి తల్లి లక్ష్మి సపర్యలు చేస్తూ కుటుంబ పోషణతో పాటు కుమారుడి వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో 2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రెండేళ్ల క్రితం రూ.40 వేలు అందించారు. ఇప్పుడు కానిస్టేబుల్ కూండ్రపు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వీరంతా రూ.42 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని సోమవారం అందజేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ



పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న రమణ

రోలుగుంట: పండగ పూటా పప్పన్నానికి నోచుకోని 30 పేద కుటుంబాలకు బుచ్చింపేట నవతరం అసోసియేషన్ ప్రతినిధి అనిమిరెడ్డి రమణ 15 రకాల వంట సరుకులను ఆదివారం పంపిణీ చేశాడు. గ్రామానికి చెందిన కొంతమంది పేదలు ఇంట్లో వంట సరుకులు లేక పండగ పూట పస్తులు ఉంటున్నారని తెలుసుకుని ఈ విధంగా సాయం చేసి తన మానవత్వం చాటుకున్నాడు. అసోషియేషన్ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ పోటీలో ఘర్షణ

మాకవరపాలెం: వాలీబాల్ పోటీలో వివాదం ఘర్షణకు దారి తీసింది. స్థానికులు వివరాల ప్రకారం.. జి.వెంకటాపురం శివారు జి.నగరం పాఠశాలలో ఆదివారం రెండు వర్గాలవారు వాలీబాల్ ఆడుతుండగా వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో సోమవారం ఇక్కడి రామాలయం వద్ద తీర్థంలో ఆ గొడవ చినికి చినికి వివాదం పెద్దదైంది. ఈ క్రమంలో గాయపడిన వంకల శ్రీను, వొమ్మి శ్రీనులను 108 వాహనంలో మాకవరపాలెం పీహెచ్‌సీకి తరలించారు. వంకల శ్రీనును నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వీరితోపాటు మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎస్ఐ రామకృష్ణారావును సంప్రదించగా ఇరు వర్గాలను విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందజేస్తున్న విప్ ధర్మశ్రీ

మాడుగుల రూరల్: తన తండ్రి అమ్మతల్లినాయుడు జ్ఞాపకార్థంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మళ్ల అప్పారావు కె.జె.పురంలో కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఆదివారం రాత్రి ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వీటిని 24 మందికి అందించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం వల్ల గ్రామాల్లో క్రీడలు అభివృద్ధి చెందుతాయన్నారు. మద్దాల రమణ, కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పండగే!



బుచ్చెయ్యపేట: బంగారుమెట్టలో ఎడ్లబళ్ల పరుగు పందెం తిలకిస్తున్న ప్రజలు

- గ్రామాల్లో మొదలైన తీర్థ మహోత్సవాలు
- అంగరంగ వైభవంగా సంక్రాంతి, కనుమ వేడుకలు
- ఉత్సాహంగా సాగిన వివిధ ఆటల పోటీలు

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి, కనుమ వేడుకలను గ్రామ గ్రామన ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాకిళ్లలో రంగవల్లులు.. వీధుల్లో గంగిరెద్దులు విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఒకవైపు, దూర ప్రాంతాల నుంచి చేరుకున్న బంధువులు, కుటుంబ సభ్యుల ఆత్మీయ పలకరింపులు మరోవైపు, ఇళ్లలో ఘుమఘుమలాడే పిండివంటలు, సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల సందడితో పల్లెలు మురిసిపోయాయి. వీటికితోడు గ్రామ తీర్థ మహోత్సవాలు ప్రారంభం కావడంతో మరింత జోష్ నెలకొంది.

మాడుగుల: స్థానిక భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కోటబయలు ఆవరణలో సతకంపట్టు వద్ద ఆదివారం పాడి రైతులను ఘనంగా సన్మానించారు. మండల స్థాయి షటిల్ టోర్నమెంటు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ట్రస్టు సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ ఎన్ఆర్ఐ కోడెల లక్ష్మీప్రసాదు, పావని దంపతులు లక్ష రూపాయల చెక్కు ట్రస్టు సభ్యులకు అందజేశారు.

ఆకట్టుకున్న హాస్యనాటిక

ఆదివారం రాత్రి మాడుగుల కళాకారులతో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు పర్యవేక్షణలో, శాంతో సురేష్ దర్శకత్వంలో మంచం మీద మనిషి హాస్య నాటిక ఆద్యంతం అలరించింది. బుచ్చెయ్య చౌదరి, బసవపున్నమ్మల కుమార్తె పావని, దర్శకత్వం వహించిన సురేష్‌శాంతో తదితర్లకు సన్మానం చేశారు. భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, తవ్వా సన్యాసిశెట్టి, సర్పంచ్ యడ్ల కళావతి, భారత నిర్మాణ సేవా నిర్వాహకులు గౌరీపట్టపు మహేశ్, మధు, వి. మాలకొండయ్య, మండల వాసు, గౌరీపట్టపు త్రినాథ్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్, ముగ్గులు, డ్యాన్స్, తదితర పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో తామరంలో క్రికెట్, డ్యాన్స్, లెమెన్ స్పూన్, ముగ్గులు పోటీలు జరిగాయి. నారాయణరాజుపేటలో ముగ్గులు, కోలాటం, శెట్టిపాలెంలో ముగ్గులు, స్లో సైకిలింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో విజేతలకు బహుమతులు అందజేశారు.

రోలుగుంట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన పల్లె అసోసియేషన్ ఆధ్వర్యంలో జె.నాయుడుపపాలెంలో షటిల్, వాలీబాల్, స్లో సైకిల్ తదితర పోటీలను నిర్వహించారు. హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో కొమరవోలు, యువజన సంఘం ఆధ్వర్యంలో రోలుగుంటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, షటిల్ పోటీల్లో 20 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. జె.నాయుడుపాలెంలో పోటీలకు తన వంతుగా సాయమందించిన కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌ను ఘనంగా సత్కరించారు.

దేవరాపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని సర్పంచ్ కర్రి సూరినాయుడు ఆధ్వర్యంలో మామిడిపల్లిలో మహిళలకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు జెడ్పీటీసీ కర్రి సత్యం, పూడి కృష్ణంనాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ జూరెడ్డి గోవింద బహుమతులను ప్రదానం చేశారు.



మాడుగుల సతకంపట్టు వద్ద పాడి రైతులను సన్మానిస్తున్న దృశ్యం



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న ఎన్ఆర్ఐ లక్ష్మీప్రసాద్ దంపతులు

కె.కోటపాడు: శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పైడంపేటలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలతోపాటు పాల్గొన్న మహిళలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, విశాఖపట్నానికి చెందిన చిన్న పిల్లల వైద్యుడు ఆర్.అచ్చంనాయుడు బహుమతులు ప్రదానం చేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ విద్యార్థులకు బహుమతులు అందించారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రొంగలి రమేష్, వై.జగ్గనాయుడు, ఆర్.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

చోడవరం: పట్టణంలోని అన్ని దేవాలయాలతో పాటు గ్రామాల్లో తోడపెద్దులకు మహిళలు పూజలు చేశారు. స్వయంభూ గౌరీశ్వరస్వామి, కేశవ స్వామి ఆలయాల వద్ద తీర్థాలు జరిగాయి. ప్రఖ్యాత గాంచిన త్రివేణి సంగమం ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద తీర్థం చూసేందుకు వందలాది మంది తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసిపోయింది.

లక్కవరంలో తీర్థం సందర్భంగా ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. దుద్దుపాలెం, బుచ్చెయ్యపేటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

మాడుగుల: జంపెనలో ముగ్గులు పోటీలు, సైకిల్, ఉట్టికొట్టే పందేలు నిర్వహించారు. యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంటరాజారామ్, సర్పంచ్ నేమాల గురువునాయుడు, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి గోకేడ అప్పలనాయుడు వ్యవహరించారు.

రావికమతం: సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో గిరిజన గ్రామం కవగుంటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. అనంతరం థింసా నృత్యంతో మహిళలు ఆకట్టుకున్నారు.

వేడుకగా పారువేట

చీడికాడ: సంక్రాంతి సందర్భంగా అర్జునగిరి వైభవ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా సోమవారం అక్కడ స్వామివారి పారువేట నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది భక్తులు గొర్రె పిల్ల తోక కోసి విడిచి పెట్టారు. ఈ గొర్రె పిల్ల ఏ దిక్కుకు పరుగెడితే ఆ ప్రాంతంలో పంటలు బాగా పండుతాయని పెద్దలు నమ్మకం. ఈ ఘట్టం అత్యంత వైభవంగా సాగింది. అనంతరం స్వామివారి పల్లకి సేవ పురవీధుల్లో నిర్వహించారు.



చీడికాడ: పల్లకిలో నృసింహస్వామి వారి ఊరేగింపు



మాకవరపాలెం: తామరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



రోలుగుంటలో కబడ్డీ ఆడుతున్న యువకులు



చోడవరం: ముద్దుర్తిలో సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ



మాడుగుల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న న్యాయనిర్ణేతలు గురువునాయుడు, అప్పలనాయుడు



కె.కోటపాడు: విజేతలకు బహుమతులు అందిస్తున్న శివాజీరాజు, డాక్టర్ అచ్చంనాయుడు



చోడవరం: సంక్రాంతి రోజున తోడపెద్దుకు పూజలు చేస్తున్న మహిళలు



చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం వద్ద తీర్థం

సందడిగా తీర్థ మహోత్సవాలు

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పరుగు పందేలు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. బంగారుమెట్టలో ఆదివారం జరిగిన అచ్చమ్మ పేరంటాలు, పొట్టిదొరపాలెం రాములోరి తీర్థ మహాత్సవాలకు వేలాది మంది కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగుల రాట్నం తిరుగుతూ ఈలలు వేస్తూ, బూరలు ఎగరేస్తూ, నేతి చెక్కీలు, ఖర్జూరం ఇతర తిని బండారాలు కొనుగోలు చేసి చిన్నారులతోపాటు పెద్దలు ఉత్సహంగా గడిపారు. ఎద్దుల పరుగు పందెం, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆటల పోటీలు అలరించాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవం

దేవరాపల్లి: తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా బూడి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను సర్పంచ్ గొంప వరహాలమ్మ, మాజీ ఎంపీటీసీ మలిరెడ్డి మహలక్ష్మీనాయుడు ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు రైవాడ, ఎస్.జి. నగరంలో తీర్థాలు...

రైవాడ ఎరకాలమ్మ అమ్మవారు, ఎస్.జి. నగరంలో నారితల్లమ్మ తీర్థ మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. ఎస్.జి.నగరంలో జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు ఉంటాయన్నారు.

ఘనంగా రాములోరి తీర్థం

మాడుగుల రూరల్: కనుమ పండగ సందర్భంగా సోమవారం వీరనారాయణంలో శ్రీరాములోరి తీర్థం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మాకవరపాలెం: గ్రామాల్లో తీర్థమహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో సోమవారం రామన్నపాలెం, పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద తీర్థ మహోత్సవాలు జరిగాయి. ఈ తీర్థాలకు చిన్నా, పెద్దా అధిక సంఖ్యలో హాజరై ఆనందంగా గడిపారు.

నేడు దండుముత్యాలమ్మ తీర్థం

కె.కోటపాడు: గొండుపాలెంలో దండుముత్యాలమ్మ తీర్థ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



దేవరాపల్లి: తారువలో హోరా హోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు



జె.నాయుడుపపాలెంలో కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌కు సన్మానం



దేవరాపల్లి: మామిడిపల్లిలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సత్యం



రావికమతం: కవగుంటలో గిరిజన మహిళల థింసా నృత్యం



బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెంలో వేస్తున్న రంగు రంగుల ముగ్గులు

ఐక్యతకు ప్రతీకగా గ్రామతీర్థాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్: గ్రామతీర్థాలు ప్రజలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం కె.జె.పురంలో పరిదేశమ్మ తీర్థం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల్లో విజేతలకు ఆయన బహమతులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజలు కుల మతాలను పక్కన పెట్టి తీర్థాలను ఐక్యతతో నిర్వహించుకున్నప్పుడే ప్రతి ఒక్కరిలో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. కబడ్డీ, ముగ్గులు పోటీలు నిర్వహించారు. సర్పంచ్ జామి రమణబాబు, గోవాడ సుగర్స్ పరిపాలనాధికారి పి.వి.రమణమూర్తి, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పార్టీ నేతలు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఆడారి గణేశ్, ఎం.వి. సత్యనారాయణ, దాడి రాము, కాళ్ల బుచ్చిబాబు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు, స్థానిక పరిదేశమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎడ్లబళ్ల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

మహిళ ఆత్మహత్యా యత్నం

దేవరాపల్లి: స్థానిక టీటీడీ కల్యాణ మండపానికి ఆనుకున్న దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన స్థలంలో తను నివాసముంటున్న పూరిపాకను అధికారులు తొలగిస్తున్నారని మనస్తాపంతో బొబ్బరి నాగమణి(45) ఆత్మహత్యకు యత్నించింది. ఈ స్థలంలో నివసిస్తున్న ఆమెతోపాటు నాగమణి తదితర ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయంగా స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. అనంతరం ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయాలని దేవదాయ శాఖ అధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. వాటిని బేఖాతరు చేయడంతో ఈ నెల 13న పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగింపునకు సమాయత్తమయ్యారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన బొబ్బరి నాగమణి తన ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. దీంతో దేవదాయశాఖ అధికారులు ఆక్రమణలు తొలగింపును తాత్కాలికంగా వాయిదా వేశారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

మాకవరపాలెం: రెండు గ్రామాల్లో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని వజ్రగడ, కొండలఅగ్రహారం గ్రామ శివారుల్లో కోడిపందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బంది కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని నుంచి ఐదు కోళ్లు, రూ.1,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.



వజ్రగడలో పట్టుబడిన వారితో పోలీసులు

రామన్నపాలెంలో ఐదుగురు అరెస్టు

రామన్నపాలెంలో కోడిపందేలాడుతున్న ఐదుగురిని సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలో తీర్థం సందర్భంగా పందాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి మూడుకోళ్లు, రూ.1,450 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

మైచర్లపాలెంలో ఆరుగురు..

చోడవరం రూరల్: కోడి పందేలాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఆదివారం మైచర్లపాలెంలో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు కోడిపుంజులను, రూ.4,200 స్వాధీనం చేసుకున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేల పట్టాతో జూదం నిర్వాహకుడు...

దామునాపల్లిలో నేలపట్టా వేసి జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు చోడవరం హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి ఆదివారం దాడి చేశారు. నిర్వాహకుడిని అరెస్టు చేసి అతడి నుంచి నేలపట్టాతోపాటు రూ.550 స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు.

అంబరాన్నంటిన మకరజ్యోతి సంబరాలు

ఘనంగా స్వామి అయ్యప్ప రథయాత్ర
సినీ, టీవీ ఆర్టిస్టుల సందడి



మకరజ్యోతి ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసిన భక్తులు



పట్టణంలో స్వామివారి రథయాత్ర

నర్సీపట్నం: శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో నిర్వహించిన మకరజ్యోతి మహోత్సవాలు అంబరాన్నితాకాయి. టీవీ హాస్యనటులు నూకరాజు, పంచ్ ప్రసాద్, బాబు, రాజమౌళి, పటాస్ సాయిరాం వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. వీరు చేసిన హాస్యం ఆహూతులను ఆకట్టుకుంది. పండుగ రోజున మకరజ్యోతి మహోత్సవాల్లో పాల్గొనటం తమకెంతో ఆనందం కలిగిస్తుందని సినీ, టీవీ నటులు పేర్కొన్నారు. వర్ధమాన సినీ దర్శకుడు కర్రి శ్రీపతి, పెదిరెడ్ల వెంకటేష్‌ను మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సన్మానించారు. ఇక్కడ స్వామి అయ్యప్ప ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణంలో విష్ణుసహస్ర నామపారాయణ, అవతార మెహర్‌బాబా సంకీర్తనలు, సత్యసాయి సంకీర్తనలు ఆలపించారు. సాయంత్రం చిడతల కోలాటాలు, భజనల మధ్య స్వామివారి రథయాత్ర వైభవంగా సాగింది. భారీ ఎత్తున మందుగుండు సామగ్రి పేలుళ్లతో స్టేడియం మారుమోగింది. మిన్నునంటిన బాణసంచా మిరమిట్లు గొలిపాయి.

క్రికెట్, వాలీబాల్ పోటీల విజేత నాతవరం



వాలీబాల్ విజేతకు బహుమతి అందిస్తున్న మాజీ ఎంపీపీ కొండబాబు, పోతురాజు

నాతవరం: సంక్రాంతి సందర్భంగా కె.ఎస్.ఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆట పోటీలు నిర్వహించడం ఆనందాయకమని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. నాతవరంలో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్‌లో 28 జట్లు పాల్గొనగా, నాతవరం, శృంగవరం జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.15 వేలు, షీల్డు, రూ.10 వేలు షీల్డు ప్రదానం చేశారు. వాలీబాల్ పోటీల్లో 25 జట్లు పాల్గొనగా నాతవరం, నర్సీపట్నం, అల్లిపూడి జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీటికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలుతో పాటు షీల్డు ప్రదానం చేశారు. ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ సర్పంచ్ శెట్టి శ్రీనివాసరావు, నాయకులు చింతకాయల శ్రీను, బి.రాజా, పోలిరెడ్డి రాజు, ఏఎంసీ మాజీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి పాల్గొన్నారు.